క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి లక్ష్మీరాము, తదితరులు

అల్లిపురం: సంక్రాంతి పండగ సందర్భంగా జీవీఎంసీ 33వ వార్డు, అమ్మవారి వీధిలో గల శ్రీ యల్లమ్మ తల్లి పుట్ట వద్ద పేదలకు సోమవారం బియ్యం పంపిణీ చేశారు. వార్డు మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి లక్ష్మీ రాము 3 కేజీల బియ్యం చొప్పున 200 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సంక్రాంతికి పేదలకు బియ్యం పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో పీవీఎస్ రెడ్డి, గణేష్‌రావు, పి.ధర్మారావు, వేగి రాము, పి.దాము తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులు పరిశీలిస్తున్న బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం: సంక్రాంతి సందర్భంగా జీవీఎంసీ 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఎవరి ఇంటి ముందు వారు భారీ ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. పోటీలకు వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు బొడ్డేటి ప్రసాద్ న్యాయనిర్ణేతగా పాల్గొని విజేతలను నిర్ణయించారు. వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డీజే బాయ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఇద్దరి చేరిక



మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చేర్పించిన వారితో ఏయూటీడీ ప్రతినిధి

సీతమ్మధార: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇద్దరిని గవర్నమెంట్ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఏయూటీడీ సంస్థ కేర్ టేకర్లు నందూరి శ్రీనివాస్, ప్రశాంత్ తెలిపారు. బొబ్బిలికి చెందిన సోమనాథ్ (49), కార్తిక్ పూర్తి వివరాలు ఏమీ చెప్పడం లేదని... వీరిద్దరూ ఎక్కడపడితే అక్కడ మలవిసర్జన చేస్తుండటంతో పరిస్థితి బాగాలేక వెంటనే ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించామని తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మహారాణిపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మాన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి కోసం భక్తులు హోమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా భోగి పండగ



వెచ్చని చలిమంటలతో సంక్రాంతి లక్ష్మికి ఆహ్వానం

నియోజకవర్గంలో పండగ సందడి

అల్లిపురం: నియోజకవర్గ ప్రజలు భోగి పండగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నిద్రలేచి నువ్వుల నూనె, నలుగు పిండితో స్నానం ఆచరించి, కొత్త దుస్తులు ధరించి భోగేశ్వరునికి పూజ చేసి, వెచ్చని మంటలతో చలి కాచుకున్నారు. పిడకల దండలు మంటల్లో వేసి భక్తిశ్రద్ధలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. మేలుకొలుపుల బృందం హరినామ స్మరణతో అల్లిపురంలో తిరువీధి నిర్వహించారు. భోగి మంట చుట్టూ చేరి హరినామ సంకీర్తనలు పాడి అందరినీ ఉత్సాహపరిచారు. యువత గాలిపటాలతో వీధులన్నింటినీ అలంకరించారు. చిన్నారులకు పెద్దవారు భోగిపండ్లు పోసి పాటలు పాడి ఉత్సాహపరిచారు. అల్లిపురంలో వీధులన్నీ రంగురంగుల పతంగులతో అలంకరించారు.

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. డూడూ బసవన్నలు.. గంగిరెడ్ల కోలాహలంతో భోగిమంటల వెలుగుల్లో పండగ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చిమ్మ చీకట్లను పటాపంచలు చేస్తూ వెలుగురేఖలు నింపే భోగిమంటల్ని యువత ఆనందోత్సాహాల నడుమ తెల్లవారుజామునే వేశారు. పూర్ణామార్కెట్ నుంచి టౌన్ కొత్త రోడ్డు వరకు ఉన్న దుకాణాల ముందు ఆయా దుకాణాల యజమానులు భోగి మంటలు వేశారు. వీధులు, గల్లీల్లో భోగి మంటల సందడి కనిపించింది. జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెంలో వరుసగా నాలుగైదు వీధుల్లో పెద్ద ఎత్తున మంటలు వేశారు. ప్రేమ సమాజంలో అనాథ పిల్లలు భోగి మంటలతో ఎంజాయ్ చేశారు. జగదాంబ జంక్షన్ వద్ద విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భోగి మంటలు వేశారు.



నగర సంకీర్తన పాడుతూ బల్లిగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భజన బృందం



గంగిరెద్దులతో చిన్నారులు



భోగి మంట వద్ద దిబ్బలపాలెం యూత్

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

దాబాగార్డెన్స్: నగర ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా రోడ్లు ఊడుస్తూ శుభ్రపరుస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి సందర్భంగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సోమవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రక్షణగా పారిశుద్ధ్య కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారని, వారికి అభినందనలు తెలిపారు.



కుమ్మర వీధిలో హరిదాసుతో స్థానికులు



చీరలు, దుప్పట్లతో పారిశుద్ధ్య కార్మికులు

నగరంలో హరిదాసుల సందడి

అల్లిపురం: సంక్రాంతి అంటేనే హరిదాసులు, గంగిరెద్దుల సందడి అని చెప్పవచ్చు. భోగి సందర్భంగా అల్లిపురంలో హరిదాసుల సందడి కనిపించింది. గత నెల రోజులుగా వీధివీధీ తిరిగినా భోగి, సంక్రాంతి రోజున మాత్రం ప్రతి ఇంటికి వచ్చి భిక్ష తీసుకుంటారు. వీరికి యువతులు, మహిళలు భిక్ష వేసేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. హరి నామసంకీర్తనతో హరిదాసులు సందడి చేశారు. హరి హరి నారాయణ.. ఆదినారాయణ అంటూ గరిడీలతో సందడి చేశారు. అలాగే భోగి పండగ సందర్భంగా చిన్నారుల తలపై పెద్దలు భోగి పండ్లు, రేగి పండ్లు, చెరుకు ముక్కలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాన్ని చిన్నారులు కలిగిన ప్రతి ఇంట్లో సందడిగా నిర్వహించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి ముగ్గు వద్ద చిన్నారులు

ఆధ్యాత్మిక జీవనంతో పరిపూర్ణత



పార్వతీ కుమార్ రాసిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న బీఎస్ఎన్ రాజు, కె.రమణీగోపాల్, బీఆర్‌కే రాజు



గురు ప్రార్థన చేస్తున్న విదేశీ సాధకులు

మహారాణిపేట: పరిపూర్ణత సాధించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుందని, దానిని సాధించడానికి మాస్టర్ పార్వతీకుమార్ రాసిన పుస్తకాలు ఉపకరిస్తాయని కోల్‌కత్తా ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ బి.ఎస్.ఎన్.రాజు అన్నారు. జగద్గురుపీఠం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాల ముగింపు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీకుమార్ రచించిన 'అక్కల్ట్ మెడిటేషన్' అనే ఆంగ్ల వ్యాస్యాన్ని ఆయన ఆవిష్కరించి, ప్రసంగించారు. ధనిష్ఠ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ అశ్విస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. 'ఎక్వేరియస్ మాస్టర్' అనే పుస్తకాన్ని సర్కిల్ ఆఫ్ గుడ్‌విల్ కార్యదర్శి బి.ఆర్.కె. రాజు, 'విష్ణు సహస్రనామం' వ్యాఖ్యానాన్ని కె.రమణి, మాస్టర్ సీవీవీ, ఎం.ఎన్.ఇ.కెలపై శ్రీపతి సనత్ కుమార్ సంకలనం చేసిన బాలల కథల చిత్ర రూప పుస్తకాలను విడుదల చేశారు. సభలో కె.రమణి గోపాల్, బి.ఆర్.కె.రాజు, జగద్గురు పీఠం ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, సీహెచ్ సత్యదేవ్, జి.వి.ఎన్.హరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

గురుపూజలో విదేశీ సాధకులు

జగద్గురు పీఠం ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోశా ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 64వ గురుపూజ మహోత్సవాల్లో విదేశీ సాధకులు పాల్గొన్నారు. సుమారు 22 మంది విదేశీ సాధకులు గురు ప్రార్థన చేశారు. వీరు వేదిక మీద హిందూ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పాటించారు. అనేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో కె.గురుప్రసాద్, వారణాసి పార్వతి ,వి.వి.రామకృష్ణ శాస్త్రి, జి.వి.కృష్ణమోహన్, శ్రీపతి సనత్ కుమార్, యు.ఎస్.ఎస్.రాము ప్రసంగించారు. గొల్లపూడి రవికుమార్ బృందం ఉత్సాహంగా హనుమాన్ చాలీసా గానం చేశారు. అజ్జరపు శ్రీనివాస్, బి.ఆర్.కె.రాజు, ఎస్.శుభశ్రీ, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

కనులపండువగా గోదారంగనాథుల కల్యాణం



పెండ్లి వస్త్రాల అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత గోదా రంగనాథులు



కల్యాణోత్సవంలో భక్తులు



కల్యాణ ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం సోమవారం ఇల వైకుంఠాన్ని తలపించింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా దేవస్థానం కల్యాణ మండపంలో గోదా రంగనాథుల కల్యాణం కనులపండువలా నిర్వహించారు. గోదాదేవి, రంగనాథులు భక్తులకు కల్యాణ దంపతులుగా దర్శనమిచ్చారు. అర్చకులు గొడవర్తి వీర రాఘవాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయ్ దేవదాయ శాఖ తరఫున గోదా రంగనాథులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు పువ్వుల మాలలతో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కల్యాణం అనంతరం భక్తులకు విందు ఏర్పాటు చేశారు.

అలివేలు మంగ దేవాలయంలో..

స్థానిక అలివేలు మంగ దేవాలయంలో సోమవారం సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. ఆలయ అర్చకులు పి.కేశవాచార్యులు కల్యాణమూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో అలివేలు మంగమ్మకు, పద్మావతి అమ్మవారికి, గోదాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

పాండురంగ స్వామి ఆలయంలో...

మహారాణిపేట: ధనుర్మాస ఉత్సవాలు ముగియడంతో భోగి పండగ పర్వదినాన పాండురంగపురంలోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా అర్చకులు కల్యాణోత్సవం జరిపారు. ఆలయ ఈవో అడపా దేవుళ్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

జోరుగా గాలిపటాల అమ్మకాలు

అల్లిపురం: సంక్రాంతి వచ్చిందంటే గాలి పటాల సందడి నగరంలో ప్రారంభమవుతుంది. ఎక్కడ చూసినా రంగు రంగుల గాలిపటాలతో దుకాణాలు వెలుస్తాయి. సంక్రాంతి అంటే అందరి కళ్లలోనూ వెలుగులు నింపే పెద్ద పండగ. సంక్రాంతి పండగను తెలుగు నేలపై ఒక్కోచోట ఒక్కో రీతిలో జరుపుకుంటారు. కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్లు, డూడూ బసవన్నలు, ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు, పిండివంటలతో ప్రతి ఇంటా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకుతాయి. నగరంలో గాలిపటాల విక్రయాలంటే గుర్తుకు వచ్చేది మొదట అల్లిపురం అని చెప్పకోవచ్చు. సంక్రాంతి సెలవులు కూడా తోడవటంతో పిల్లలు రోజంతా గాలిపటాలతో సందడి చేస్తున్నారు. గాలిపటాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.



కుమ్మరవీధిలో గాలిపటాల విక్రయాల దుకాణం వద్ద చిన్నారుల సందడి

చిన్నారులకు బహుమతులు అందజేత



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న తోట పద్మావతి, రీసు చంద్రరావు, తదితరులు

అల్లిపురం: సంక్రాంతి సందర్భంగా నీలమాంబ అమ్మవారి ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో చిన్నారులకు సోమవారం బహుమతులు పంపిణీ చేశారు. 34వ వార్డు యాతపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ తోట పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా భోగి రోజున రీసు చంద్రరావు పిల్లలకు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. వార్డు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లింగం శ్రీనివాసరావు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



పిల్లలకు భోగి పండ్లు పోస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, తదితరులు



బొమ్మల కొలువు వద్ద చిన్నారులు

మహారాణిపేట: సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు మన భారతావని అని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. సోమవారం భోగి సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిన్నారులకు భోగి పండ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల వారికి సంక్రాంతి ఘనంగా జరుపుకోవడం సంప్రదాయమన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మలయవాసినీ, కేజీహెచ్ గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ భోగి, సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ లక్ష్మీనారాయణ, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీకి చెందిన రూపాకుల రవికుమార్, డాక్టర్ పుల్లారావు, మహేష్, గూడా మైథిలి, గిరిజ, డి.బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. బొమ్మల కొలువులో అనేక రకాల బొమ్మలు ఏర్పాటు చేశారు.

నగరం నిర్మానుష్యం



నిత్యం రద్దీగా ఉండే కేజీహెచ్ డౌన్ రోడ్డు ఇలా...

- బంద్‌ను తలపించిన రోడ్లు, రద్దీ కూడళ్లు
- సంక్రాంతికి తరలిపోయిన నగరవాసులు



నిర్మానుష్యంగా టౌన్ కొత్త రోడ్డు



ఖాళీగా మారిన కేజీహెచ్ గైనకాలజీ వార్డు

దాబాగార్డెన్స్: నిత్యం రద్దీగా ఉండే విశాఖ మహానగరం నిర్మానుష్యంగా మారింది. రెండు రోజుల ముందు వేలాది మందితో కిటకిటలాడిన జగదాంబ జంక్షన్ భోగి పండగ రోజు మూగబోయింది. కోలాహలంగా ఉండే దుకాణాలు వెలవెలబోయాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పొట్ట కూటి కోసం నగరానికి వలస వచ్చిన వారంతా సంక్రాంతి పండగ సందర్భంగా స్వస్థలాలకు తరలి వెళ్లడంతో స్మార్ట్ నగరం వెలవెలబోయింది. వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా పండగకు వారి పల్లెలకు తరలడంతో పట్టణం నిర్మానుష్యంగా మారింది. పలు ప్రాంతాలు, రద్దీ కూడళ్లు బంద్ వాతావరణాన్ని తలపించాయి. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అనేక మంది రోగులు (అత్యవసర పేషెంట్లు మినహా) కూడా పండగకు వెళ్లిపోయారు. దీంతో ఆస్పత్రులు కూడా వెలవెలబోయాయి. దుకాణాలు మూతపడ్డాయి. రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. మార్కెట్లు మూతపడ్డాయి. వస్త్ర దుకాణాలు అంతంత మాత్రంగానే తెరిచారు. ప్రధాన రోడ్లు, జంక్షన్లు ఖాళీగా కనిపించాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొంత మేర రద్దీ ఉన్నా మధ్యాహ్నం నుంచి అందరూ ఇంటి పట్టునే ఉండిపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

కనులారా వైభవుడి నిజరూప దర్శనం

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున గోదాదేవిని మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేయించిన అనంతరం వైభవుడికి ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు అనంతరం స్వామి నిజరూప దర్శనం భక్తులకు కలిగించారు. భోగి ఉత్సవాల్లో భాగంగా పౌష్య లక్ష్మికి పూజలు చేశారు. సంక్రాంతికి సంబంధించిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు భోగి మంటలు వెలిగించి భక్తులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

విద్యుత్ చార్జీల భారంపై నిరసన



విద్యుత్ బిల్లులను భోగిమంటలో వేస్తున్న నేతలు

ఏయూక్యాంపస్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. భోగి పురస్కరించుకుని బి.ఎస్.ఆర్ నగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గతంలో టీడీపీ, జనసేన ప్రతిపక్షలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపుపై బాదుడే బాదుడు అంటూ ఉపన్యాసాలు ఇచ్చారని, నేడు వీరే చార్జీలు అధికంగా పెంచి భారం మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే మొదట తాను తగలబెడతానని లోకేష్ అన్న మాటలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రూ.16 వేల కోట్ల విద్యుత్ భారం మోపడం సరైన నిర్ణయం కాదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వలన ప్రజలపై మరింత అధిక భారం పడుతుందన్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని మోపిందని ఆరోపించారు. కార్యక్రమంలో పి.నాగమణి, జి.నాగరాజు, జి.లక్ష్మీ నారాయణ, సి.హెచ్ రాము,గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టమెంట్ ఉద్యోగులందరికీ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం ఏపీపీటీడీ ఉద్యోగులందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆయన కోరారు.